# చిట్టి కథ

- జెన్



## టైమ్ మెషిన్

ఆ శాస్త్రవేత్త టైమ్ మెషిన్
కనిపెట్టే పనిలో ఉన్నాడు.
ఆ ప్రయత్నంలో
ఆకలి దప్పికలూ మరిచిపోయాడు.
తల్లడిల్లిపోయిన తల్లి
గోరుముద్దలు తినిపించింది.
ఆ మాధుర్యాన్ని ఆస్వాదిస్తూ..
బాల్యంలోకి వెళ్లాడు శాస్త్రవేత్త.
టైమ్ మెషిన్‌లో జరిగేదీ అదే!

## ఉనికి



మనిషిని మెప్పించే తపనలో
రామచిలుక గొంతుక మార్చింది.
మాటలు నేర్చింది.
బందీగా మారింది.
కాకి ఎప్పుడూ..
ఆ పొరపాటు చేయలేదు.
స్వేచ్ఛగా బతికేస్తున్నది.



## మరుజన్మలో

‘వచ్చే జన్మలో
నాన్నకు కొడుకుగా కాదు..
తండ్రిగా జన్మించే
అవకాశం ఇవ్వు స్వామీ!
నాకిచ్చిన ప్రేమ
తిరిగివ్వాలి కదా’
వేడుకున్నాడు ఆ తనయుడు
తండ్రికి దహన సంస్కారం చేస్తూ.



## గుండె

ఎవరో అపరిచిత మహిళ.
అతని క్యాబిన్‌లోకి దూసుకొచ్చింది.
‘మిమ్మల్ని హగ్ చేసుకోవచ్చా?
మీ గుండె చప్పుడు వినాలి’
అంటూ మరింత దగ్గరికొచ్చింది.
ఆమె జవాబు విన్నాక..
అడ్డుకోబోతున్నవాడు ఆగిపోయాడు.
‘మీకు అమర్చక ముందు..
ఈ గుండె మా ఆయనది’

## కళ్లు

ఆమె కుటుంబాన్ని అంతం చేసి..
రాక్షస వివాహం చేసుకున్నాడు.
‘ఎందుకింత తెగించావ్?
నాలో నీకు ఏం నచ్చింది?’
నిలదీసిందామె.
‘నీ చారెడు కళ్లు’
తన్మయత్వంతో జవాబిచ్చాడు.
‘అంతేగా, తీసుకో..’ అంటూ
తన రెండు కళ్లూ పీకి
అతని చేతిలో పెట్టింది.

